# 99వ పుష్పము

99. ఓం శ్రీ సాయి - సకలతత్త్వ బోధకాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు

సకల = సర్వం;

తత్త్వం = తత్త్వుడు = తత్త్వ స్వరూపుడు = పరమేశ్వరుడు.

"తత్త్వం తథ్యమమృతం సత్యం పరమార్థః సత్యత్త్వా మిత్యేవ,

ఏకార్థ వాచికః పరమార్తవతో బ్రహ్మణీ వాచకాః శబ్దాః"

తత్త్వవిదుడు = తత్త్వము చక్కగా నెరిగినవాడు.

తత్త్వం స్వరూపం యథావదేత్తీతి తత్త్వవిత్.

తత్త్వం = పరమాత్మ స్వరూపం; సత్య స్వభావం; అనగా దేనిమీద ఇతర సత్యములు ఆధారపడి యుండునో అట్టి మౌలిక సత్యము లేక దేనినుండి యితర సత్యములు ఉత్పన్నములో అట్టి మౌలిక సత్యము తత్ = అది (పరబ్రహ్మము) త్వమ్ = నీవు; అపి = అయి వున్నావు. ఇది తత్త్వమపి అర్థము. "నేనెవరిని" అనేది విచారిస్తే ఉత్తమ జ్ఞానం వస్తుంది. దానివల్లనే వైరాగ్యము, దానివల్ల సర్వము పరబ్రహ్మమే అనే స్థితి వస్తుంది. స్వామి తత్త్వవిదుడు, తత్త్వాన్ని చక్కగా నెరి గినవాడు. అందరిని ఆత్మస్వరూపులారా అని, పరమాత్మ స్వరూపులారా అని సంబోధిస్తారు. స్వామి బోధల సారం అంతా "తత్త్వమసి" అందరు పరమేశ్వరులవియే. నీవును ఆ సర్వ ప్రపంచ అధిష్ఠాన సత్తామాత్రమై యుండెడి, అద్వి తీయ, అఖండ, ఏకరస, పూర్ణ బ్రహ్మ అభిన్న ప్రత్యక్ స్వరూపమై యున్నాడవు అని సకలతత్త్వమును బోధించు స్వామికి నా నమస్కారము.

2) కవీశ్వరుడైన వాణీ స్వరూపుడు

ప॥ చదువు లన్నియు చదివి చదివి ।<br>
మదిని తానెరుంగడు మందమతుడు ।<br>
ఎంత చదువు చదివిన ఏ రీతి నున్నను ।<br>
హీనుడవగుణంబు మానలేడు ॥

దివ్య గౌడపాదీయ అద్వైత దర్శనం (Cont.):

ఘటాకాశాది భేద బుద్ధి కలిగియుండుటచేతనే రూప కార్యాది భేద వ్యవహారము సంభవించుచున్నది. అట్లే దేహో పాధి విశిష్ట జీవ భేద బుద్ధి చేతనే జన్మ మరణాది వ్యవహారము కలిగినది. కాని కృతముగానే - ఆత్మకు క్లేశ కర్మఫల మలసత్వము ప్రాప్తించుచున్నదిగాని, వాస్తవముగా లేదు. ఉదాహరణము : లోకములో మూఢులకు ఆకాశము, మేఘము, దుమ్ము, పొగ మున్నగు మలములచేత మలినము గలదియగుచున్నది. వివేకులకు మాత్రము ఆకాశము మలినము లేనిదే యగుచున్నది. అట్లే ప్రత్యేగాత్మకు, జ్ఞాన శూన్యులగు మూఢులకు విజ్ఞప్తి మాత్ర స్వరూపుడగు పరమా త్మయు ప్రత్యక్లేశ, కర్మఫల, రూప, మలినములచే మలినులవలె గనబడుచున్నాడు. ఆత్మజ్ఞులగు వివేకులకు మాత్రము అట్లు కనబడడు. ఉదాహరణ 2: ఎండమావులు (చవిటిపర్ర - మహాజల ప్రవాహము) జీవుడు బ్రహ్మమునకు అంశము గాని, వికారము గాని కాడు. ఉపాధి అను ప్రవిష్ణుడగు పరమాత్మయే జీవశబ్దముతో పిలువబడుచున్నాడు. జీవుడు రాగాది మలిన సమన్వితుడు గాడు. పరమార్థముగా ఇవి లేవు. మూఢులకు ఆకాశమెట్లో, జీవుడు అంతే. జ్ఞానులకు ఆకాశమెట్లో, జీవుడు అంతే.

3) సకలతత్త్వ బోధకుడు - ఆత్మవిద్య

"ఆధ్మాత్మ విద్య, విద్యానాం" అని గీతయందు కూడా విభూతి యోగమున తెలుపబడెను. 'విత్' అను ధాతువునకు 'య' అను అవ్యయము చేర్చినప్పడు "విద్య" అను పదము ఏర్పడును. య = ఏది? విత్ = వెలుగు - ఏది వెలుగు నిచ్చుచున్నదో అది విద్యయని యుత్పత్తి అర్థము. కనుక విద్యయను పదము బ్రహ్మవిద్యకే తగినది. జ్ఞానమును వెలు గుగా, అజ్ఞానము చీకటిగా వర్ణించారు మన పూర్వీకులు. ప్రకాశ అంధకారములు ఒకే కాలమున నిలువజాలవు.

కావున ప్రగతి పథమున పయనించు ప్రతి మానవుడు ఆత్మవిద్యను లేక బ్రహ్మవిద్యను అభ్యసించి పరిశుద్ధాత్ముడు కావలెను. అన్ని నదులు సముద్రమున కలియునటులే అన్ని విద్యలు, ఆత్మ విద్యలు ఆత్మ విద్యలో లీనమగుచున్నవి. అంతే కాదు సాగర సంగమ సమయమున నదులన్నియు తమ ప్రత్యేక నామ రూపములను కోల్పోయి అఖండ సముద్ర ఆకృతి అయినట్లు బ్రహ్మ విద్యా సాగర సమ్మేళనమున బాహ్యవిద్య లన్నియు, స్వరూప నామ రూపాదులు పరిత్యజించు చున్నవి. "విద్యా తపోభ్యాం పూతాత్మ". విద్య వలనను, తపస్సు వలనను మానవుడు విప్రుడగుచున్నాడు. విద్య - బాహ్య విద్య, బ్రహ్మ విద్య అని రెండు విధములు. బాహ్య విద్య కేవలము మానవుని జీవుని ఉపాధికి ఏర్పడినది. పొట్టకూటి చదువులు అని పేర్కొనబడినవి. ఇక బ్రహ్మ విద్య సమస్త మానవులను కృతకృతునిగా చేయు సామర్థ్యము కలదియై యున్నది. ఇహలోక, పరలోక సంబంధము కలిగించును, కల్పించును. అందరిని కడతేర్చగల దివ్యశక్తి బ్రహ్మ విద్యకు తప్ప బాహ్య విద్యలకు లేదు. బ్రహ్మవిద్య బ్రహ్మమును తెలుపును. తపస్సు పరబ్రహ్మములో కలుపును.

4) సర్వజ్ఞుడు - భగవద్గీత

శ్లో॥ సర్గాణామాది రంతశ్చ । మధ్యం చైవాహ మర్జున ।
అధ్యాత్మ విద్యా విద్యానాం । వాదః ప్రవదతామహం ॥ (10-32)

తా॥ అర్జునా! నేనే సృష్టులకు ఉత్పత్తియు, మధ్యమును అనగా స్థితియును, లయమున్ను ముగింపును, అనగా నాశముగాను యున్నాను. నేను విద్యలలో ఆత్మను గూర్చిన విద్యను తర్కించువారల యొక్క వాదజల్ప, వితండము లుగను ఉన్నాను.

ముండకోపనిషత్తు

ఉ॥ తస్మై సహోవాచ ద్వేవిద్యే వేదితవ్యే ఇత హస్మయద్
బ్రహ్మవిదో వదంతి పరాచైవా పరాచ ॥

తా॥ శాస్త్రవిధి అనుసరించి తన సమీపమునకు వచ్చిన ప్రశ్నము నొనర్చిన శౌనకునితో అంగిరసుడు అంటున్నాడు. "వేదార్థము నెరింగి పరమార్థగ్నులయిన బ్రహ్మవేత్తలు పరయనియు, అపర యనియు పేరుగల రెండు విద్యలు కల వనియు, వానిని తెలిసికొన వలెనని పల్కుచున్నారు.

ఉ॥ తత్రాపరా, ఋగ్వేదో యజుర్వేద స్సామవేదోథర్వ వేద
శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం ఛందో జ్యోతిష మితి
అధ పరాయయా తదక్షరమధిగమ్యతే ॥ (1-1-5)

తా॥ పర విద్య యనగా - పరమాత్మను గురించి బోధించు విద్య - బ్రహ్మ విద్య, బ్రహ్మము అవినాశి, ఉపషద్విద్యతో బ్రహ్మ పొందబడును.

అపర విద్య యనగా ధర్మాధర్మ సాధనములను, తత్ఫలములను బోధించు విద్య - ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ చతుర్వేదములు, శిక్షా, కల్ప వ్యాకరణ, నిరుక్త, ఛంద, జ్యోతిషము అను షడంగములు అగును.

పరవిద్య = వెలుగు ఇచ్చును, జ్ఞానమును ఇచ్చును, అజ్ఞానమును పోగొట్టును. ఇదే బ్రహ్మవిద్య మానవుని కృత కృత్యునిగ చేయును.

అపర విద్య = బాహ్య విద్య, మానవుని జీవిత ఉపాధికి ఏర్పడినది. పొట్టకూటికి పనికి వస్తాయి. ఇహలోక, పరలోక బంధములు కల్పించును.

ఉ॥ యదానద్య స్యందమానా । ... ... ... పురుష ముపైతి దివ్యమ్ ॥

(ముం.ఉ. 3-2-8)

తా॥ లోకమునందు నామ రూపములు కలిగి ప్రవహించుచున్న మహా నదులు సముద్రమును పొందినవై, తమ నామ రూపమును వదలి సముద్రము యగుచున్నవో, అట్లే విద్వాంసుడగువాడు అవిద్యా కృతములగు నామ రూప ములు, విడచినవాడై పరాత్పరుడును, ప్రకాశ స్వరూపుడును అగు పురుషుని పొందుచున్నాడు. తత్స్వరూపుడే యగు చున్నాడు.

ఉ॥ బ్రహ్మ విద్యాం వరిష్ఠాం । సదా సద్భిః సేవ్యమానాం నిగూఢాం
యయా చిరాత్సర్వ పాపం వ్యపోహ్య । పరాత్పరం పురుష
ముపైతి విద్వాన్ ॥1॥ (కై.ఉ. 1)
"స బ్రహ్మ విద్యాం సర్వ విద్యా ప్రతిష్ఠా ॥" (ముం.ఉ.1111)

ఉ॥ "తరతి శోక మాత్మ విత్" (ఛాం.ఉ. 7-1-3)

5) ప్రేమ స్వరూపుడు - తేజస్సు

"నీవు వెలుతురు, తేజస్సు చూచినప్పుడు ఉత్తేజుడవు కానట్లయితే నీవు చాలా దూరంగా వున్నావనే అనుకోవాలి. నీకు నాకు వున్న సంబంధంలో ఇదే సత్యము" (స్వామి).

దివ్యలీల : క్రీస్తు -శిలువ సృష్టి

ఒకసారి స్వామి జాను హిస్లాప్‌కు క్రీస్తు శిలువ సృష్టించి యిచ్చారు. ఆ శిలువ కర్రతో చేసినది. 2000 సం॥ క్రితము ఏ కర్రమీద శిలువ వేశారో, అదే కర్ర స్వామి తెప్పించారు. శిలువ వేస్తున్నప్పుడు ఆయన పడిన బాధ స్పష్టంగా ఆ సృష్టించిన శిలువ మీద క్రీస్తులో స్పష్టంగా కనిపించాయి. నెత్తురు వస్తున్న గాయాలు స్పష్టంగా వున్నాయి. నోటి నుండి వచ్చిన చొంగ ఎండిపోయిన చారలు కనబడ్డాయి. ఇటువంటి సృష్టి చాలా అపూర్వమైనది. అప్పుడు (2000 సం॥ క్రింద) ఉపయోగించిన కర్ర రావటానికి స్వామి మూడుసార్లు ఊదవలసి వచ్చింది. అద్భుతమైన విషయము. జాను హిస్లావు దానిని అమెరికాకు తీసుకువెళ్లి, ఎన్‌లార్జిచేసి పెద్దసైజు ఫొటోతీశారు. అప్పుడు అన్ని విషయములు, ఎన్నిచోట్ల గాయాలు వున్నవి, అన్ని స్పష్టముగా వున్నాయి. దానిని చూచి క్రీస్తు ఎంత బాధపడ్డాడోయని భక్తులంతా చాలా దుఃఖించారు.

దివ్య చికిత్స : పుట్టపర్తిలో అనూరాధ అనే స్త్రీని పాము కరచింది. స్మృతి లేదు. నోటినుండి నురగ వస్తోంది. స్వామి దగ్గరకు తీసుకువచ్చారు. స్వామి విభూతి సృష్టించి ఇచ్చి నీళ్లలో కలసి గొంతులో పొయ్యమన్నారు. కొంత చెవిలో వెయ్యమన్నారు. ఆమె వెంటనే లేచి కూర్చున్నది. "నా బిడ్డలకు తల్లి నిచ్చారు" అని స్వామి కాళ్లమీద పడింది.

6) సర్వజన ప్రియుడు - సాయి స్త్రీ కళాశాలలు (శ్రీమతి తారాప్రభు)

భగవాన్ శ్రీ సత్యసాయిబాబాచే స్థాపించబడిన స్త్రీ కళాశాలలు.

(1) అనంతపూరు 1968 (2) జయపూర్ 1971 (3) భోపాలు 1975.

ఆశయాలు :

i. (1) నమ్మకం (2) తృప్తి (3) త్యాగం (4) ముక్తి

ii. నీతి, నిజాయితీలు, స్వచ్ఛత, వినయము, గౌరవము.

iii. వారిలోని తెలివితేటలు బయటకు తీసుకురావడం.

i. పై వాటిని సంఘ సేవకు ఉపయోగించేటట్లు చేయడం.

. విజ్ఞానాన్ని పెంచడం - ప్రజ్ఞానాన్ని వృద్ధిచేయడం.

i.

భగవానుని ఆశయాలు సక్రమముగా నెరవేర్చడం. ఇవన్నీ సరిగా నెరవేర్చటానికి స్వామిని రోజు మాష్టర్లు, విద్యార్థినులు ప్రార్థిస్తూ వుంటారు.

7) స్తుతి ప్రియుడు - దివ్యభజన

ప్రేమ ముదిత మనసె కహో । రామరామరాం, రామరామరాం ।
రామ రామ రాం । శ్రీరామ రామ రాం ॥ప్రే॥

1) పాపఘటే దుఃఖమితే । లేకి రామ నాం ।
భవ సముద్ర సుఖద నావ । ఏక రామనాం ॥

2) పరమశాంతి - సుఖనిదాన । భవ్య రామ నాం ।

నిరాధారకే ఆధార । ఏక రామ నాం ॥

3) పరమగోప్య । పరమదివ్య । మంత్ర రామ నాం ।
శాంత హృదయ । సదావసత । ఏక రామ నాం ॥

4) మాతా పితా బంధు సఖా । సబ హి రామ నాం ।
భక్త జనర జీవనాధార । ఏక రామ నాం ॥

5) రామ రామ రాం । రామ రామ రాం ।
రామ రామ రాం । శ్రీరామ రామ నాం ॥ప్రే॥

దివ్య ఈశ్వరత్వము (Cont.) : దుర్విజ్ఞేయమగు ఆత్మజ్ఞాన ఫలమేమిటి. ఎవరు ఈశ్వరుని కారణరహితునిగను, సర్వలోక మహేశ్వరునిగను, జన్మహీనునిగను, సర్వ లోకేశ్వరునిగను తెలిసికొనునో అడు మనుష్యులలో మోహ శూన్యుడై, జ్ఞానా జ్ఞాన పూర్వకముగ నొనర్చిన పాపములన్నిటిని విడచుచున్నాడు. సర్వలోక మహేశ్వరత్వమనగా? = సూక్ష్మ గ్రహణ సామర్థ్యము. ఆత్మాది పదార్దముల జ్ఞానము, ప్రత్యుత్పన్నమ తత్త్వము, సహిష్ణుత, సత్యము, బాహ్య అంతర ఇంద్రియ సంయమము, సుఖము, దుఃఖము, జన్మము, మృత్యువు, భయము, అభయము, అహింస, సమచిత్తత, సంతోషము, తపస్సు, దానము, ధర్మనిమిత్తమగు కీర్తి, అధర్మనిమిత్తమగు అపకీర్తి మున్నగు విభిన్న భావములు, ప్రాణులకు స్వకర్మాను సారముగ పరమేశ్వరుని నుండియే కలుగుచున్నవి. ఇంద్రాది దేవతలును, భృగ్వాధి మహర్షు లును కూడా పరమేశ్వరుని వుత్పత్తిని అంటే జన్మరహితుడగు పరమేశ్వరుడు నానా విభూతులతో ఆవిర్భవించుటను ఎరుగరు. ఎందుకంటే దేవతలకును, మహర్షులకును కూడా సర్వవిధముల ఉత్పాదకుడును, ప్రవర్తకుడును అగు మూల కారణము పరమేశ్వరుడే. పరమేశ్వరుని కృప లేకున్న అతనిని ఎవరు ఎరుంగజాలరు. విభూతి అనగా, వి = వివిధ రూప; భూతి = భవనము. అంటే బుద్ధ్యాదులుగల, ఉపాదాన రూపమున సర్వాత్మకత్వము (యింకా వుంది).

8) వేదాంతవేద్యుడు - తేజోబిందూపనిషత్తు (4వ అధ్యాయము)

ఉ॥ దేహత్రయాది రిక్తోహం । శుద్ధ చైతన్య మస్మ్యహమ్ ।
బ్రహ్మాహమితి యస్యాన్త । స్సజీవన్ముక్త ఉచ్యతే ॥

తా॥ నేను మూడు దేహములు అతిక్రమించిన వాడను. నేను శుద్ధ చైతన్యముగా నున్నాను. నేనే బ్రహ్మమునను భావన ఎవనికి అంతఃకరణమున కలదో అతడు జీవన్ముక్తుడు.

(ఇంకా) నేను బ్రహ్మముగా యున్నాను. నేను బ్రహ్మముగా యున్నాను. నేను బ్రహ్మముగా యున్నాను. నేను చిత్తుగా యున్నాను. నేను చిత్తుగా యున్నాను. బ్రహ్మమే నేను. చిత్తే నేను అను చింతను విడచి ఎవ్వడు చిత్తుడుగనే యున్నాడో అతడు ముక్తుడే. నేను పూర్ణానందముగా యున్నాను. జ్ఞానమున్ను లేక తాను తప్ప వేరొక వస్తువు కనబడని స్థితి ఎట్టిదో అదియే ముక్తి. ఈ జగత్తునునది బ్రహ్మమే. నేను చిన్మాత్రమే. ఈ ప్రపంచము లేనేలేదు. దానికి వుత్పత్తి స్థితి లేదు, నిలకడలేదు, చిత్తము లేదు, అహంకారము లేదు, జీవుడు లేదు. అంతా ఎల్లప్పడు నేనే యున్నాను. నాకంటె యితరమైనది కొద్దిగా కూడా లేదు.

**ఓం తత్సత్**